www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025

5

తిరుపతి



డేనియల్ చిల్డ్రన్స్ హోంలో..
'సద్ది బిరియాని' తిని విద్యార్థులకు అస్వస్థత



ప్రజాశక్తి - చిల్లకూరు

చిల్లకూరు మండల కేంద్రంలోని డేనియల్ చిల్డ్రన్స్ హోంలో మిగిలిపోయిన బిరియానీని రాత్రి ఎక్కడినుంచో తెచ్చి తెల్లారి విద్యార్థులకు అల్పాహారంగా నిర్వాహకులు పెట్టడంతో ఫుడ్‌పాయిజన్ అయ్యి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సిబ్బంది వెంటనే వీరిని చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని గూడూరు ఏరియా ఆస్పత్రికి పంపించారు. సబ్‌కలెక్టర్‌ర రాఘవేంద్ర మీనా విద్యార్థులను పరామర్శించారు. పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

టిడిఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌లో గందరగోళం
మా స్థలాలు బలవంతంగా లాక్కున్నారు..!



స్పెషల్‌డ్రైవ్‌లో నిలదీస్తున్న ఖాదీకాలనీవాసులు



మాకు చెప్పకనే తీసుకున్నారు : నిర్మల

చింతలచేనులోని సర్వే నంబర్ 623/3, 623/3 'సి'లో 50 అంకణాల స్థలాన్ని బలవంతంగా తీసుకున్నారు. స్థలం తీసుకుని ఐదేళ్లయినా టిడిఆర్ బాండ్లు ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించాం. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అసలు మాకు స్థలమే లేదని తిట్టి పంపించారు. ప్రస్తుతం ఇక్కడ అంకణం 3 లక్షలు ధర పలుకుతోంది. మా స్థలానికి దాదాపు కోటిన్నర ధర ఉంది. ప్రస్తుతం స్పెషల్‌డ్రైవ్‌లో ఫిర్యాదు చేశాం. అయితే టిడిఆర్ బాండు రావడానికి చాలా సమయం పడుతుందని అంటున్నారు. భర్త లేడు. ఇద్దరు పిల్లల్ని ఎలా పోషించుకోవాలి.



ప్రస్తుత మార్కెట్ ధర ఇవ్వాల్సిందే : సుమాంజలి

కొంకాయ్ చెన్నాయిగుంట సర్వే నంబర్ 165/27లో వారసత్వంగా వంద అంకణాల స్థలం ఉంది. నేను చెన్నయ్‌లో నివాసం ఉంటున్నారు. మాకు చెప్పకుండానే మాస్టర్‌ప్లాన్ రోడ్డు వేసేశారు. ఈ విషయం నాకు ఆలస్యంగా తెలిసింది. టిడిఆర్ బాండు ఇవ్వలేదు. వారికి కావాల్సిన వారికి మాత్రం ఇచ్చుకున్నారు. కమర్షియల్ పేరుతో స్థలం తీసుకుని, రెసిడెన్షియల్ పేరుతో టిడిఆర్ బాండు రాసుకోవాలంట. న్యాయమైన ధరకే బాండ్లు ఇవ్వాలి.



వేరే వాళ్లకు ఎలా ఇస్తారు : అరుణకుమారి

కొంకాయ్ చెన్నైగుంట సర్వే నంబర్ 174/3లో 66 అంకణాలు ఉంది. మాకు చెప్పకుండానే అధికారులు తీసుకున్నారు. కొంతమంది దళారులు మా స్థలంలోనే వేరే సర్వే నంబర్ వేసి టిడిఆర్ బాండ్లు తీసుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కోటి 60 లక్షలు ధర పలుకుతోంది. ఈ స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇచ్చాను.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వైసిపి ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం పేరుతో నగరంలో 23 నూతన మాస్టర్‌ప్లాన్ రోడ్ల కోసం దాదాపు 2వేల ఎకరాల భూములను అప్పట్లో తీసుకున్నారు. బాధితులకు చెప్పకుండానే మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. శుక్రవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన టిడిఆర్ బాండ్ల జారీలో స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని టిడిఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల వారీగా వివరాలను సేకరించారు. దరఖాస్తుల పరిశీలన, వాలిడేషన్, రిజిస్ట్రేషన్ విధానంపై వివరించారు. ఈ మేళాలో తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లు, డిసిపి మహాపాత్ర, ఎసిపిలు బాలాజీ, మూర్తి పాల్గొన్నారు. భూములు కోల్పోయిన బాధితులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అయితే డిసిపి మహాపాత్రోకు తెలుగు రాదు. బాధితులకు ఇంగ్లీష్ రాదు. సమస్య ఎట్టా సెప్పుకోవాలంటూ గందరగోళపడటం కనిపించింది. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం 448 మందికి టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. గతంలో 90 మందికి ఇచ్చారు. మిగిలిన వారికి ఇవ్వలేదు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా తీర్పు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు టిడిఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.


తుడా అప్రూవల్ ఉంటే ఇవ్వరంట : ఖాదీకాలనీవాసులు

1983లో ఖాదీకాలనీలో తుడా అప్రూవల్ కలిగిన స్థలాలను తీసుకుని ఇళ్లు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కొక్కరి దగ్గర 10-20 అంకణాలు తీసుకుని మాస్టర్‌ప్లాన్ రోడ్డు వేశారు. ఇపుడు టిడిఆర్ బాండ్లు ఇవ్వమని అడిగితే తుడా అప్రూవల్ ఉండటం వల్ల, జీవో ఒప్పుకోదని చెబుతున్నారు. మార్కెట్ ధరకైనా బాండు ఇవ్వాలని, లేదంటే పూర్తిగా నష్టపోతామని బాధితులు బోరున విలపిస్తున్నారు. టిడిఆర్ బాండు ఇవ్వకపోతే తమ స్థలాలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. కొర్లగుంటకు ఓ న్యాయం, ఖాదీకాలనీకి మరో న్యాయమా అని ప్రశ్నించారు. కొర్లగుంట, గ్రూప్‌థియేటర్ రోడ్డులో ఇళ్ల ముందు స్థలం కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లు మంజూరు చేశారు. ఖాదీకాలనీ వారికి అర్హత లేదనే కొత్త వాదనను అధికారులు తెరపైకి తీసుకురావడం గమనార్హం.

పారదర్శకంగా పరిశీలన : కమిషనర్

మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధృవీకరణ జరుగుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. శుక్రవారం నిర్వహించిన టిడిఆర్ మేళాలో 27 మాస్టర్‌ప్లాన్‌రోడ్లలో భూములు కోల్పోయిన వారికి సంబంధించిన 35 మందికి ఆధార్ వాలిడేషన్ చేశాం. 45 మందికి ప్రీఅప్రూవల్ చేసి గిఫ్ట్ డీడ్ ఇచ్చేందుకు అనుమతి మంజూరు చేశాం. 27 మాస్టర్‌ప్లాన్ రోడ్లలో 1074 స్థలాలు ఉన్నాయి. ఇప్పటివరకూ 443 మంది ఆస్తి యజమానులకు టిడిఆర్ బాండ్లు ఇచ్చారు. ఇంకా 626 మందికి ఇవ్వాల్సి ఉంది. నగర పాలక సంస్థ పరిధిలో 214 మంది దరఖాస్తులు సేకరించి ఆన్‌లైన్ చేశాం. తగిన ధృవపత్రాలతో వచ్చిన వారికి ఈ మేళాలో టిడిఆర్ బాండ్లు పొందేందుకున్ని సహాయక చర్యలు చేపడతాం.

అర్హులైన వారికి బాండ్లు ఇస్తాం : శ్రీనివాసు, టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన వారందరికీ టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ జరుగుతుంది. బాధితులు స్థలాలను మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి సరైన ధృవపత్రాలు అందజేయాలి. రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనివారు వారి స్థలం రికార్డు, ఆధార్, ఫోన్ నెంబర్ తో పాటు ఇతర వివరాలు ఇక్కడ ఆన్లైన్లో నమోదు చేస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకే అర్హులైన వారికి టిడిఆర్ బాండ్లు ఇస్తాం.

పెట్లూరు దళిత గిరిజనులకు అండగా ఉంటా : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్



కలెక్టర్‌కు సిపిఎం వినతి

వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామంలోని సీతారాం ఏచూరి నగర్ లో నివసిస్తున్న దళిత గిరిజనులకు అండగా ఉంటానని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. తమ మీద ఫారెస్ట్ అధికారులు చేస్తున్న దౌర్జన్యానికి నిరసనగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కి అర్జీ సమర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతు సబ్ కలెక్టర్ , డీఎఫ్ఓ, ఫారెస్ట్ అధికారులను స్థలాల వద్దకు పంపి సమగ్ర విచారణ చేసి పట్టాలు మంజూరు చేస్తానని, ప్రభుత్వం కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వమని, పేదలకు భూములు పంచమని ఆదేశాలు ఇచ్చిందన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తానని తెలిపారు. అంతకుముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పేదల మీద ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని, హద్దులు నిర్ణయించినప్పటికీ జోక్యం చేసుకోవడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. వెంకటగిరి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి వడ్డిపల్లి చంగయ్య మాట్లాడుతూ తాము రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చి రసీదులు పొందామని, ఇప్పటికే ఇల్లు నిర్మించుకొని జీవిస్తున్నామని, తమకి కరెంటు, మంచినీరు కల్పించకుండా ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పేదలను శిక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గారు పేదలకు అండగా నిలబడాలని కోరారు. ఈ ధర్నా అనంతరం డివిజనల్ ఫారెస్ట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అర్జీ సమర్పించారు .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్ మునిరాజ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



గూడూరులో కరపత్రాలను పంచుతూ..

గూడూరు టౌన్ : వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని శుక్రారం గూడూరులోని జామియా మసీదు, నూర్ మజీదుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ చట్టం ఆస్తులు కబ్జా చేయడానికి తప్ప, ఆస్తుల అభివృద్ధికి కాదన్నారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని, వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని, భారత రాజ్యాంగంలోని 25, 29, 30 తదితర నిబంధనలకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని, మజిదులు, దర్గాలు, స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడతాయని పేర్కొన్నారు. లౌకిక శక్తులు ముందుకొచ్చి బిల్లు రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.వెంకటరామి రెడ్డి, జోగి. శివకుమార్, బి.వి. రమణయ్య, పామంజి.మణి, బి. చంద్రయ్య, బి.నారాయణ పాల్గొన్నారు.

టీటీడీకి రెండు మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వ్యాన్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల



తిరుమల శ్రీవారికి శుక్రవారం బెంగళూరులోని ఎం.ఎస్.రామయ్య విద్యా సంస్థలకు చెందిన ఎం.ఎస్.సుందర్ రామ్ అనే భక్తుడు అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు రూ.45 లక్షల విలువైన అశోక్ లేల్యాండ్ కంపెనీకి చెందిన రెండు బడా దోస్త్ మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వ్యాన్లను విరాళంగా అందించారు. ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనం తాళాలను టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ ఈ అత్యాధునిక వాహనాలు భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో క్యూలైన్ల వెంబడి ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేసేందుకు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ వాహనాలతో ఒకేసారి 3వేల మందికి అన్న ప్రసాదాలు పంపిణీ చేయవచ్చున్నారు. ఈరోజు నుండి ఈ వాహనాలను వినియోగించనున్నట్లు వెల్లడించారు. దాతలు ప్రస్తుతం రెండు వాహనాలను విరాళంగా ఇచ్చారని, మరో వాహనం డిజైనింగ్ లో ఉన్నందున త్వరలో అందివ్వనున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా దాతలను అదనపు ఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్ పోర్ట్ డిపో మేనేజర్ లక్ష్మీ ప్రసన్న, ఇన్ ఛార్జ్ డీఐ హరిబాబు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు అందుతున్న సేవలపై సమీక్ష

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు కల్పిస్తున్న సేవలు, భక్తుల నుండి వస్తున్న సూచనలు , ఫిర్యాదులపై టిటిడి ఈవో జే. శ్యామల రావు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం టిటిడి పరిపాలన భవనంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మం, ఇంఛార్జ్ సీవీఎస్వో వి. హర్షవర్ధన్ రాజులతో కలసి పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీవారి దర్శనం, వసతి సదుపాయాలు, అన్నప్రసాదాలు, క్యూలైన్లలో సదుపాయాలు, కల్యాణకట్ట, రవాణా, విజిలెన్స్ , పారిశుద్ధ్యం తదితర శాఖలపై ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో టిటిడి సీఈ టి.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్లు జైలు శిక్ష


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. ఆరు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పును వెలువరించారు. 2020లో కరకంబాడి బీటు తిరుపతి రేంజ్ పరిధిలో పట్టుబడ్డ ప్రకాశం జిల్లా కు చెందిన చెరబోయిన వెంకటరమణ, పింజరి మహబూబ్ బాషా అను ఇద్దరు ముద్దాయిలకు ఎర్రచందనం అక్రమ రవాణా నేరం నిరూపితం కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు ఇచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు ముద్దాయిలను నెల్లూరు సెంట్రల్ జైలుకు అధికారులు తరలించారు. ఈ తీర్పు ఎర్రచందనం స్మగ్లర్లకు ఓ హెచ్చరిక అని టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు హెచ్చరించారు.

యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో ఒప్పందం వద్దు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు సిఐటియు విజ్ఞప్తి



విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపీఏలు) చేసుకున్న కాంట్రాక్టర్ల ప్రయోజనాలు కాపాడటంలో ఉన్న శ్రద్ధ... వినియోగదారులు, కార్మికుల ప్రయోజనాలు కాపాడటంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్ సి) వైఫల్యం చెందిందని సిపిఎం నేత కందారపు మురళి విమర్శించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో చేసుకున్న ఒప్పందాల (ఎంఓయు)పై శుక్రవారం ఉదయం ఆన్ లైన్ లో కర్నూలు నుంచి విద్యుత్ నియంత్రణ మండలి జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం నేత మురళి తిరుపతి నుంచి తన వాదనలు వినిపించారు. యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో చేసుకున్న ఒప్పందం వల్ల 16 వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందని, ప్రజల సొమ్మును 25 ఏళ్ల పాటు ఓ ప్రైవేటు కంపెనీకి చెల్లించటానికి తొందరపాటు అవసరం లేదని, ఒక యూనిట్ కేవలం రూ.2.50పైలకే రెన్యువబుల్ ఎనర్జీ వస్తుండగా రూ.4.60లకు ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం లేదని కందారపు మురళి వివరించారు. తక్షణం యాక్సిస్ ఎనర్జీ విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ)ను రద్దు చేయాలని కమిషన్ ముందు వాదనలు వినిపించారు. కాంట్రాక్టు కార్మికులు గత 12 రోజులుగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్నారని, వాచ్ మెన్ లుగా పనిచేస్తున్న వారు షిఫ్ట్ ఆపరేటర్ లుగా పదోన్నతి పొందారని, వాచ్ మెన్ లుగా పొందుతున్న వేతనం రూ.18వేలు కాగా ప్రస్తుతం రూ. 3వేల తక్కువతో రూ.15 వేల వేతనం పొందుతున్నారని, ప్రమోషన్ పొందితే వేతనం పెరగడం చూశామని, తిరుపతి డిస్కంలో తగ్గటం విచిత్రమని కందారపు మురళి వ్యాఖ్యానించారు. ఈనెల 7వ తేదీన అన్ని డిస్కాం కార్యాలయాల దగ్గర కాంట్రాక్ట్ కార్మికులు భారీ ధర్నాలు చేస్తున్నారని పిపిఏ ల పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం మంచినీళ్ల ప్రాయంగా కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నదని, ఏళ్ల తరబడి పిఆర్సీ అరియర్స్ కోసం ఎదురుచూస్తున్న కార్మికుల పట్ల నిర్దయగా వ్యవహరించడం న్యాయమా? అని ప్రశ్నించారు. కేవలం రూ. 240 కోట్ల ఖర్చుతో పిఆర్సీ అరియర్స్ చెల్లించవచ్చని, ఇది చెల్లించడానికి అధికారులకు మనసు రావడంలేదని తీవ్రంగా విమర్శించారు. పర్మినెంట్ ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ తన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులపై లేకపోవడం ఏ రకంగా న్యాయమో? కమిషన్ ఆలోచించాలని కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అభ్యంతర దారులు తమ వాదనలను వినిపించారు. కర్నూలు నుంచి విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఠాకూర్ సింగ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి నుంచి కందారపు మురళి ఆన్ లైన్ ద్వారా తన వాదనలను కమిషన్ ముందు వినిపించారు. వాదనలను విన్న ఏపీఈఆర్ సి ఛైర్మన్ ఠాకూర్ సింగ్ స్పందిస్తూ విద్యుత్ ఒప్పందాలపై ప్రజలకు నష్టం జరగని రీతిలో తగిన నిర్ణయం తీసుకుంటామని, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయమని అధికారులను ఆదేశిస్తున్నామని ప్రకటించారు.

ప్రైవేటీకరణ ప్రయత్నాలు మానుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రేపటి నుంచి తపాలా జాతీయ మహాసభలు




ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీవరకు అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్ట్ మెన్, ఎంటీఎస్ రాష్ట్ర శాఖ మహాసభలు స్థానిక మహేష్ కళ్యాణ సభలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం స్థానిక రిసెప్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.మురళీ, ప్రధాన కార్యదర్శి బి.శ్రీధర్ బాబు శుక్రవారం తెలిపారు. తపాలా శాఖను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి ప్రయత్నాలు చేస్తోందన్నారు. అందులో భాగంగా మాజీ క్యాబినెట్ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం నేతత్వంలో టాస్క్ పోర్స్ కమిటీని వేసిందన్నారు. లాభదాయకమైన పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, స్పీడ్ పోస్ట్, పార్సిల్ వంటి విభాగాలను కార్పొరేట్ చేయడానికి ప్రత్యేక విభాగాలను నియమించినట్లు తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తూ ఎన్ఎఫ్ పీఈ, అనుబంధ సంఘాలు సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే కరోనా కాలంలో రైతులు నిర్వహించిన సమ్మెకు మద్దతు తెలిపి వారికి ఆర్థిక సహాయం అందించారనే నెపంతో ఎన్ఎఫ్ పీఈ గుర్తింపును రద్దు చేసిందన్నారు. దీనిపై జార్ఖండ్ హైకోర్టు స్టే ఇచ్చినా అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని చెప్పారు. ఇదివరకు ఎప్పుడూ లేనివిధంగా అధికారులు, ఉద్యోగులపై పనిభారం పెంచుతూ టార్గెట్లను విధిస్తూ వేదింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పలు రకాలుగా ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తూ రావాల్సిన రాయితీలను రాకుండా నిలిపివేస్తున్నారని చెప్పారు. తపాలా ప్రైవేటీకరణలో భాగంగా పీవోఎస్ బీ ఖాతాలను ఐపీపీబీకి మళ్లించడం ద్వారా చిన్న మొత్తాల పొదుపు విభాగం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతిలో వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే మానుకుని తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నెలకొన్న అన్నిరకాల సమస్యలపై ఈ మహాసభల్లో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించనున్నట్లు చెప్పారు. అలాగే తపాలా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సమ్మెకు వెళ్లడానికి ఈ సభల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం రిసెప్షన్ కమిటీ చైర్మన్ ఖుర్షిద్ బేగం, వర్కింగ్ ప్రెసిడెంట్ మదన్ మోహన్ రెడ్డి, ఏఐపీఈయూ గ్రూప్ సీ తిరుపతి డివిజన్ అధ్యక్షులు వై.శేషాద్రి, కార్యదర్శి మధుబాబు, శ్రీకాళహస్తి బ్రాంచి కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఏఐజీడీఎస్ యూ డివిజన్ కార్యదర్శి కె.నాగయ్య, నాయకులు కిషోర్, రూపేష్, మునస్వామి నాయక్, కిరణ్ కుమార్, సత్యనారాయణ, బాలాజీ ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.



పుచ్ఛకాయ 'భారీ'..! 'ధర' లేదు ఈ'సారి'


'సాంప్రదాయ పంటలు వద్దు... వాణిజ్య పంటలు ముద్దు' అంటూ ఉద్యానవన శాఖ తూర్పు మండలాల్లో విస్తారంగా ప్రచారం చేసింది.. దిగుబడులు భారీగా వస్తాయని రైతులను ప్రోత్సహించింది.. తీరా కాయ చేతికొచ్చే సమయానికి 'మార్కెటింగ్.. మాకు సంబంధం లేదు' అన్నట్లుగా ఉద్యానవన శాఖ తీరు ఉంది. అధికారుల మాటలు నమ్మి భారీగా పుచ్చ, దోస సాగు చేసిన రైతులు భారీగా నష్టాలను చవి చూశారు. గతంలో ఎన్నడూ లేనంతగా కేజీ దోస, పుచ్చ బహిరంగ మార్కెట్లోనే 10 రూపాయలకు పడిపోయింది. రైతులకు గిట్టుబాటు కాక లబోదిబోమంటున్నారు. ఎన్నడూ లేనంతగా ధర పతనం కావడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. పంట పండితే ధరలు లేవు... ధర ఉంటే పంటలు పండవు అన్నట్లుగా రైతుల పరిస్థితి.

రైతులను నట్టేట ముంచిన ఉద్యానశాఖ
'విజన్ 2029'లో సబ్జీ కూలర్లు ఇస్తారట..!
పుచ్చ, దోస రైతులకు భారీ నష్టం
తోటల్లోనే కుళ్లుతున్న కాయలు



ప్రభుత్వమే ఆదుకోవాలి
కత్తి రామయ్య, రైతు, బోనుపల్లి

రెండు ఎకరాల్లో పుచ్చ పంటను సాగు చేశా. సుమారు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. గిట్టుబాటు ధర లేక కాయలను బాడుగ ట్రాక్టర్‌లో తీసుకొచ్చి శ్రీకాళహస్తిలో అమ్ముకుంటున్నా. పుచ్చ, దోసకు ప్రభుత్వం మార్కెటింగ్, మద్దతు ధర ప్రకటించి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.



త్వరలో సాకారం: పుష్పలత, ఉద్యానవన అధికారి, శ్రీకాళహస్తి

వరి, మిర్చి, పామాయిల్ పంటలకు మాత్రమే ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. మిగతా పంటలకు ప్రయివేట్ మార్కెట్లో మంచి ధరే ఉంటుంది. దళారుల మోసాల నుంచి బయట పడేందుకు ప్రభుత్వం త్వరలోనే కూల్ గోదాములు, సబ్జీ కూలర్ల సౌకర్యం కల్పించనుంది.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తూర్పు మండలాల్లోని రైతులు ఈ సారి భారీగా(2 వేల ఎకరాల్లో) పుచ్చ, దోస వేసి అదే స్థాయిలో దెబ్బతిన్నారు. పెట్టుబడులు పెరగడం, ధర తగ్గడంతో నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక దశలో రూ.25 వేలు పలికిన టన్ను పుచ్చ, దోస ధర నేడు రూ.7 వేలు కూడా లేదు. రైతులేమో ఎకరాకు రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టారు. కొన్ని చోట్ల మాత్రమే ఆశించిన మేర దిగుబడులు రాగా, చాలా చోట్ల అరా కొరా దిగుబడే వచ్చింది. అయితే సీజన్ ప్రారంభ దశలో టన్ను రూ. 25 వేలకు కొన్న వ్యాపారులు క్రమంగా ధరను తగ్గించేశారు. దళారులు సిండికేట్ గా మారి రైతుల వద్ద టన్ను రూ.7 వేలకు కొని వ్యాపారులకు రూ. 20 నుంచి రూ. 25 వేలకి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా అత్తెసరు ధరకు దళారులకు అమ్ముకోలేని కొందరు రైతులు తామే వీధి వ్యాపారి అవతారమెత్తి కాయలను అమ్ముకుంటున్నారు. కొందరు ఏమీ చేయలేక కాయలను తోటల్లోనే పశువులకు వదిలేస్తున్నారు.

మార్కెటింగ్ ఎక్కడ?

ఉద్యాన పంటలపై రైతుల్లో మక్కువ పెంచుతున్న ఆ శాఖ అధికారులు మార్కెటింగ్ విషయంలో చేతులెత్తేస్తున్న పరిస్థితి. ఆరుగాలం చెమటోడ్చి పంటలు పండిస్తున్న రైతులు సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేక దళారుల చేతుల్లో మోసపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరి, మిర్చి, పామాయుల్ పంటలకు మాత్రమే మార్కెటింగ్, మద్దతు ధర సౌకర్యం కల్పిస్తోంది. తక్కిన పంటలనంతా రైతే స్వయంగా అమ్ముకోవాల్సిన పరిస్థితి. తూర్పు మండలాల్లో పండే ఉద్యాన పంటలకు చెన్నై, బెంగళూరు ప్రధాన మార్కెటింగ్ కేంద్రాలుగా ఉన్నాయి. అక్కడ వ్యాపారులు, దళారులు నిర్ణయించిన ధర ప్రకారం రైతులు తమ పంటను అమ్ముకోవాల్సిందే. ఉద్యాన పంటల నిల్వకాలం తక్కువ రోజులే కాబట్టి వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వాలు వెనకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం విజన్-2029లో భాగంగా ఉద్యాన పంటల ఉత్పత్తులను సైతం నిల్వ చేసుకునేలా సబ్జీ కూలర్లను, గోదాములను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పింది. ఇది ఎంతవరకు, ఎప్పటిలోగా సాకారమవుతుందో చూడాలి మరి.

శ్రీరామలో ఆవిష్కర్ - 2025

పరిశోధనలతో మరింత నైపుణ్యత : ముని రాజులు



విద్యార్థులకు బహుమతిలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం విద్యార్థుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఆవిష్కర్ - 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాదంకి వద్ద ఉన్న నేషనల్ అట్మోస్ఫెరిక్ రిసర్చ్ లేబరేటరీ సైంటిస్ట్ పి.మునిరాజులు హాజరై మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో జరుగుతున్న మార్పులు, రాబోయే రోజుల్లో పరిశోధన విద్యతో మరింత నైపుణ్యత పెంపొందించుకోవడం, పరిశోధనల ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో పరిశోధనలకు సంబంధించి అనేక వనరులు విద్యార్థుల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు పరిశోధన సాలలను ఉపయోగించుకొని వారి మేధోశక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి తిరుపతి, జేఎన్టీయూ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సివిల్, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సిఎస్ఈ, ఏఐ, సైన్స్, మేనేజ్మెంట్ కోర్సులు చదివిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వాసు, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ బి. త్రివిక్రమ్, డాక్టర్ కె. స్వప్నసుధ, కళాశాల విభాగాధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రిలో 'పాదపూజ' మహోత్సవం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తల్లిదండ్రులకి పాదపూజ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకి పాదపూజ చేసి, ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల పాదపూజ మహోత్కర్షమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్, సుస్మిత, రజని, భవాని, సుధీర, నసీరా, యామిని, ధనశ్రీ, రూస్సీ, సమీర్, హరిత, ఉమ, జ్యోతి, శ్రీహరి, రఫీ, రాజవర్దయ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని విజయవంతం చేద్దామని జగజ్జీవన్ రామ్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ కమిటీ అధ్యక్షులు నల్లని బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బైరాగిపట్టెడ, జగజ్జీవన్ రామ్ భవనంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు ఈ జయంతి ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జయంతి ఉత్సవాల కరపత్రికను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో వెంకటరత్నం, మోహన్ రాజు, నాగరాజు, శంకర్, మధు, గురవయ్య, మునీంద్ర, దాసు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వరి ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వడమాలపేట మండలం, ఎనమల పాలెంలో వరి ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ నిషిత బేగం, మండల వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, టిడిపి నాయకులు ధనుంజయులు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జానా వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

12వ రోజుకు చేరుకున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల దీక్షలు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలపై నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 12 రోజులు దాటుతున్నప్పటికీ యాజమాన్యం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల కార్మిక నాయకుడు కుమార్ వాపోయారు. ఈరోజు జరిగిన ఏపీఈఆర్‌సి సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కోటానుకోట్లు పిపిఎల పేరుతో ధారధత్తం చేస్తున్నారు తప్పితే, ఎస్పీడీసీఎల్ పరిధిలో ఒక చిన్న సమస్యపై 12 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టినా, ఆ కార్మికుల సమస్యలను పట్టించుకునే విధంగా ఈ యాజమాన్యం వ్యవహరించట్లేదని, ఏపీఈఆర్సీ చైర్మన్‌కు వివరించారు. ఈ సమావేశంలో శివ కుమార్ రెడ్డి, ధర్మ, ప్రతాప్ హుస్సేన్ పీర్, చలపతి, ఆరోగ్య దాస్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర వేడుకల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఊరందూరులో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయం నుంచి స్కంద మూర్తిగా పరమేశ్వరుడు, జ్ఞానాంబికగా పార్వతి దేవి ఉత్స విగ్రహాలను వేడుకలకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

భారీ వాహనాల రద్దీతో జనం బెంబేలు

- రోడ్డుకు ఇరువైపులా గ్యాస్ లైన్ గొయ్యిలతో జనం కష్టాలు
- దుకాణాల నిండా దుమ్ముతో వ్యాపారస్తుల అవస్థలు
- భారీ వాహనాల దారి మళ్లింపు కోరుతున్న స్థానికులు





ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రధాన కేంద్రానికి జిల్లాలో మారుమూల ప్రాంతమయిన ప్రత్యేక స్థానం ఉంది. బుచ్చినాయుడు కండ్రిగలో రోడ్ల విస్తరణ జరగక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని సంవత్సరాలయినా కేటి మెయిన్ రోడ్డు విస్తరణ పనులు నోచుకోక ఇరుకైన రోడ్లలో భారీ వాహనాల రద్దీతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. దీనికి తోడు కంకర పరిశ్రమల, ఎర్రమట్టి క్వారీల భారీ వాహనాల వలన ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ తరచూ స్తంభించిపోతోంది. ఈ భారీ వాహనాలు మితిమీరిన వేగంతో పాటు ఒకదాని వెంట మరొకటి రోడ్లపై మట్టి చిమ్ముకుంటూ వెళుతున్నాయి. ఈ భారీ వాహనాల వలన రోడ్లలో దుమ్ము లేవడం వలన వాహన దారులు, దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ఇరువైపుల ఉన్న దుకాణాలలో వస్తువులు,దుస్తులు విలువైన ఎలక్ట్రానిక్ సామాగ్రి దుమ్ము రేగడంతో మట్టి కొట్టుకుపోతున్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు క్రమంగా ఎక్కువయ్యాయి. ఉదయం నుంచి రాత్రిళ్ళ పొద్దుపోయాక కూడా తిరిగే టిప్పర్లు, మట్టి ఇసుక తరలించే ట్రాక్టర్లు, లారీల హారన్ శబ్దాలకు స్థానికులు హోరెత్తిపోతున్నారు. రాత్రి పూట రోడ్లపై వేగంగా దూసుకొస్తున్న భారీ వాహనాల కారణంగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకు వస్తుందోనని వాహనదారులు, బాటసారులు భయందోళనకు గురవుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ప్రయాణీకులు అంటున్నారు. స్కూల్ బస్సులు, ప్రైవేటు బస్సులు, ఆటోలు ద్విచక్ర వాహనాల రద్దీ వల్ల రోడ్డు దాటాలంటే భయపడిపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యలపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని, బుచ్చినాయుడు కండ్రిగ లోపల నుండి కాకుండా, ఇతర మార్గాల ద్వారా పంపించాలని మండల ప్రజలు, వాహనదారులు, దుకాణదారులు కోరుతున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పండుగ



రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు : గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పండుగ వాతావరణంలో ప్రారంభమవుతున్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నారాయణవనం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలలో పాల్గొన్నారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లు, పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. నారాయణవనం సందు వీధిలో బోరు మోటారు, మినీ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇద్దీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాల పంపిణీ



రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి


ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండల రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండాలంటే ముందు గ్రామాల్లో ఉన్న రైతులు సుభిక్షంగా ఉండాలన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో సాగాలంటే వ్యవసాయ పనిముట్లు ఎంతో అవసరమన్నారు. రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని మండలానికి 40 రోటవేటర్లు, స్ప్రే మిషన్లు ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండల టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో క్వెస్ట్ 2 కె 25 - నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యా సంస్థల జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం సిద్ధార్థ (క్వెస్ట్ 2 కె205) వేడుకలను శుక్రవారం కళాశాలలోని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ క్వెస్ట్ కు ముఖ్య అతిథిగా డా. జోహాన్ సింగ్, ప్రిన్సిపల్ ఇంజనీర్ ఇన్ ఫోసిస్ అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ గ్రూపు బెంగుళూరు, అతిథిగా డా. దాసరి కిరణ్ కుమార్, హెచ్ఆర్ మేనేజర్ ఇండో ఎంఐఎం లిమిటెడ్ తిరుపతి వారు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్ధనా గీతంతో ప్రారంభించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన వాటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్ రాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వల్ల విద్యార్థుల మేధాశక్తి మెరుగుపడుతుందని, ఈ ప్లాంట్ ఫామ్ ద్వారా తమ నా లెడ్జ్ పెంచుకుని టెక్నికల్ గా ఎదుగుతారని తెలిపారు. వివిధ డిపార్ట్మెంట్లో విజేతలుగా నిలిచి వారికి సర్టిఫికెట్, షీల్డ్, నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ ప్రొఫెసర్ మణివాసగం, హెచ్ ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


టాలెంట్ హంట్ పరీక్షలో తిరుపతి విద్యార్థి ప్రతిభ



పాకనాటి వాణిప్రీతం

ప్రజాశక్తి - క్యాంపస్ : సిల్వర్ జోన్, న్యూఢిల్లీ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి టాలెంట్ హంట్ పరీక్షలో రాష్ట్ర స్థాయి టాపర్‌గా తిరుపతి బాలాజీ కాలనీ, కేంబ్రిడ్జి హై స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పాకనాటి వాణిప్రీతం నిలిచాడు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్స్, మెడల్స్‌ను శుక్రవారం స్కూల్ కరస్పాండెంట్ కల్పన, ఉపాధ్యాయురాలు గుణపాటి శ్రీలక్ష్మి ద్వారా అందుకున్నాడు. గతంలో కూడా సిల్వర్ జోన్ పరీక్షల్లో బంగారు పతకాలనూ, ఇస్రో నిర్వహించిన రాకెట్ మోడల్స్ కార్యక్రమంలో మొదటి స్థానం, క్రీడలలో రాష్ట్ర గోల్డ్ మెడల్ కర్లింగ్, చెస్, టేబుల్ టెన్నిస్, ఫుట్బాల్ క్రీడల్లో కూడా ప్రతిభ చూపిస్తున్నాడు. వీటితోపాటు ఎన్‌సిసి క్యాడెట్‌గా శిక్షణ అందుకుంటున్నాడు. ఈ సందర్భంగా వాణీ ప్రీతంకు కుటుంబ సభ్యులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఎస్వీజేసిలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



ప్రజాశక్తి - క్యాంపస్ : టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు అధ్యక్షతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, జగజ్జీవన్ రామ్ అనేక పోరాటాలు చేశారని ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. ప్రియవర్ధన బాబు, డా.సి.ఎల్.చెన్నారెడ్డి, ఈ. లోకేష్ రెడ్డి, కె.కృష్ణ కిశోర్, డా.మధు. డా.పి.ప్రసాద్, డా.సి.వాసుదేవులు నాయుడు, డా.కె.వి.రమణమ్మ, డా.వి. ప్రసన్న లక్ష్మీ, ఎ.కె.బాలాజీ, ఎస్.చంద్రికా భాయి, సి.రేవతి, వై.చిన్న కేశవులు, వై.మహేశ్వరయ్య, ఎన్.వరలక్ష్మి, కె. యమునలు పాల్గొన్నారు.

'విద్యుత్ దోపిడీ' వీధినాటక ప్రదర్శన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : 'విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుదాం' అంటూ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయకసాగర్ పార్కులో వీధి నాటకాన్ని శుక్రవారం ప్రదర్శించారు. 'అబద్దానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబని, ఐదేళ్లు కరెంట్ ఛార్జీలు పెంచనని, ఐదు నెలలకే జనానికి షాక్ ఇచ్చారని' అభినయ్‌రెడ్డి అన్నారు. సూపర్‌సిక్స్ అనే దొంగ హామీలతో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చారన్నారు. వీధినాటక ప్రదర్శనలో విద్యుత్ ఛార్జీల పెంపుదలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌ల మధ్య జరిగే సంభాషణ అందరినీ ఆకట్టుకుంది.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రిమాండ్ ఖైదీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి సూచించారు. సబ్ జైలును శుక్రవారం న్యాయమూర్తి సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో ముచ్చటించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయవాదులను పెటుకోలేకుంటే ఉచిత న్యాయం పొందేందుకు దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. 10వ తేదీన జరిగే జాతీయ లోక్ ఆధాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం.. సిబ్బంది తొలగింపు

ప్రజాశక్తి - ఓజిలి : జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధులు దుర్వినియోగం చేసిన ఉపాధి సిబ్బందిపై తిరుపతి డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ కొరడా ఝుళిపించారు. నిధులు దుర్వినియోగం చేసిన ఒక టిఏను సస్పెండ్ చేస్తూ మరో ఇద్దరు క్షేత్ర సహాయకులను విధుల నుంచి తొలగించిన ఘటన ఓజిలిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పిడి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఓజిలి ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించామన్నారు. ఓజిలి మండలంలో పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీపీ పథకాలలో రూ.14 కోట్లు పనులు జరిగాయని తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఉపాధి హామీ సిబ్బంది నిధులు దుర్వినియోగం చేశారని, వారి నుంచి రూ.5 లక్షలు నగదు రికవరీకి ఆదేశించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేశారని ఓజిలి మండలంలో వెంకటరెడ్డిపాలెం, ఆర్మేనిపాడు గ్రామ పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే నిధులు దుర్వినియోగానికి పాల్పడిన టిఏ ను సస్పెండ్ చేస్తూ, రూ.8 లక్షల నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలపై ఏపీవో విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో చిన్నయ్య, ఉపాధి తదితరులు పాల్గొన్నారు.

మొదటితరం ఐఐటీగా తిరుపతి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: రానున్న పదేళ్లలో తిరుపతి ఐఐటి మొదటి తరం(ఫస్ట్ జనరేషన్) ఐఐటిగా అవతరించబోతుందని ఐఐటి డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ అన్నారు. స్థానిక తిరుపతి ఐఐటిలో శుక్రవారం డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ అధ్యక్షతన 10వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్పీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కంపెనీ వ్యవస్థాపకులు ఆర్పి చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ పదేళ్ల తిరుపతి ఐఐటీ ప్రస్థానం ఎంతో ప్రతిష్టాత్మకంగా, సాగిందన్నారు. 2015లో తాత్కాలిక భవనాల్లో ప్రారంభమైన ఐఐటీ 2018 కల్లా శాశ్వత క్యాంపస్లోకి చేరుకోవటం గొప్ప విషయమన్నారు. తిరుపతి ఐఐటీని ఎంతో ప్రతతిష్టాత్మకంగా ఏర్పాటు చేసుకోవటంతో రాష్ట్ర ప్రభుత్వ సహకారం మరువలేనిదన్నారు. తమ విద్యార్థులు ఈ పదేళ్లలో సాంకేతిక నూతన ఆవిష్కరణలకై జాతీయస్థాయిలో ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారన్నారు.

బతికినంత కాలం టిడిపిలోనే ఉంటా..

యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఓపిక ఉన్నంత వరకు కాదు, ఊపిరి ఉన్నంత వరకు తాను గానీ, తన కుటుంబం గానీ తెలుగుదేశం పార్టీకి విధేయతతోనే ఉంటామని యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్ తెలిపారు. అమరావతిలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన జి.నరసింహ యాదవ్ శుక్రవారం ఉదయం తిరుపతికి రావడంతో ఆయనకు కూటమి శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. స్థానిక బాలాజీ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు ఇంచార్జ్ హేమలత, తిరుపతి ఇంచార్జ్ సుగుణమ్మ విచ్చేసి జి.నరసింహయాదవ్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టౌన్ క్లబ్ కూడలిలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆతరువాత అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించారు.కచ్చపిలో యాదవ కుటుంబ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నరసింహ యాదవ్ ను గజమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పులిగోరు మురళీకష్ణారెడ్డి, మబ్బు దేవ నారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు స్లాట్ బుకింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దివ్యాంగుల పెన్షన్లను మంజూరు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాలలో సదరం సర్టిఫికెట్ల జారీకి స్లాట్ బుకింగ్ ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హాయంలో నకిలీ పింఛన్లను గుర్తించడానికి రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల తనిఖీని నిర్వహిస్తోంది. ఇప్పటికే దాదాపు నకిలీ పింఛన్లను అధికారులు గుర్తించి నిలుపుదల చేసినట్లు సమాచారం. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి క్రమ పద్ధతిలో సదరం సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు.

శ్మశాన వాటికలు శుభ్రంగా ఉంచండి : కమిషనర్

తిరుపతి టౌన్ : శ్మశాన వాటికలను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం బాలాజి కాలని లోని శ్మశాన వాటికను, బాలాజి కాలని, ఎల్.ఐ.సి.రోడ్డు, సంస్కత విద్యాపీఠం, రిజర్వాయర్ కాలని తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేష్, నరసింహ ఆచారి, హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయి పరిష్కరించాలని వెటర్నరీ అధికారిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి : సిఐటియు

తిరుపతి టౌన్ : టిటిడిలో జరుగుతున్న పరిణామాలపై టిటిడిపాలకమండలి సభ్యులు, ఈవో, ఉన్నతాధికారుల పనితీరుపై బుధవారం విజయవాడలోని వెలగపూడి సచివాలయంలో సిఎం చంద్రబాబునాయుడు సమీక్షించారు. అయితే టిటిడి నిర్వహణలో ప్రధానపాత్ర పోషిస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ముఖ్యంగా పారిశుధ్య కార్మికుల సమస్యలపై ఏమాత్రం చర్చించకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం 4వేల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అదనంగా నియమించిందనే తప్పుడు సమాచారంతో వారిని తగ్గించాలని సంబంధిత అధికారులకు చెప్పడం సమంజసం కాదని సిఐటియు నేత టి.సుబ్రమణ్యం పేర్కొన్నారు. వివిధ విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, ఎఫ్ఎంఎస్ ,హెల్త్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులపై పని భారం పడకుండా ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, పనిచేస్తున్న ఏ ఒక్క కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించినా ఆందోళన తప్పదని హెచ్చరించారు.

నేడు భారత ప్రధాన న్యాయమూర్తి తిరుపతికి రాక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ఈనెల 5, 6 తేదీలలో రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకొని తిరుపతి నందు స్వల్ప విశ్రాంతి అనంతరం రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రి బస చేస్తారని, మరుసటి రోజు 6 వ తేదీ ఉదయం సుప్రభాత సేవలో తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 2.35 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి ఢిల్లీ తిరుగు ప్రయాణం కానున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ఈనెల 5న ఉదయం 10.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారని తెలిపారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన శివకుమార్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనిడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం శుక్రవారం నారాయణవనం బైపాస్ రోడ్డులో జరిగింది. వివరాల్లోకి వెళితే పుత్తూరు, ఎన్జీవో కాలనీకి చెందిన ఏలుమలై కుమారుడు శివ కుమార్ (35), ఎన్టీఆర్ కాలనీ చెందిన జనార్దన్ (25) వీరు ఇరువురు మోటార్ సైకిల్ పై నారాయణవనం బైపాస్ రోడ్‌లో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనింది. ఈ ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన జనార్దన్‌ను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి అమర ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన శివకుమార్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నారాయణవనం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పరీక్ష నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తగుంటలో దొంగల హల్‌చల్

ప్రజాశక్తి - చిట్టమూరు: చిట్టమూరు పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న కొత్తగుంటలో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు వివిధ దుకాణాల్లో చోరీకి యత్నించారు. ఒక దుకాణం ముందున్న సీసీ కెమెరాను చాకచక్యంగా పక్కకు నెట్టి దొంగతనానికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఇదే ప్రాంతంలో ఏడు నెలల క్రితం ఒక కారును అద్దాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నించినప్పటికీ వీలుపడక వదిలేసి వెళ్లిపోయారు. గస్తీ పోలీసులు డ్యూటీ లేని సమయంలో దొంగలు చెలరేగిపోతున్నారు. చిట్టమూరు – కొత్తగుంట సర్కిల్‌లో సిసి కెమెరాలు పూర్వం కిషోర్ బాబు ఎస్ఐగా ఉన్నప్పుడు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సీసీ కెమెరాలను సైతం తీసి పడేసి చేతివాటం చూపుతున్నారు. సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఎస్సై బలరామయ్యను వివరణ కోరగా రాత్రి నాయుడుపేట ఉరుసు కార్యక్రమానికి సిబ్బందితో సహా డ్యూటీలో వెళ్లినట్లు తెలియజేశారు.

అనుమానాస్పదంగా అరుణానదిలో ద్విచక్ర వాహనం



ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణవనం మండల కేంద్రం సమీపంలోని తిరుపతి-చెన్నై జాతీయ రహదారిని ఆనుకొని ప్రవహిస్తున్న అరుణానదిలో అనుమానాస్పదంగా ఓ ద్విచక్ర వాహనం పడిఉంది. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో వాహనం పడి ఉంటుందని తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ ఎన్జీఓ కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ఈ ప్రమాదంలో ఉన్నట్లు తెలిపారు. ఒకరు మృతి చెందారని, మరొకరు గాయపడ్డారన్నారు. ద్విచక్ర వాహనం పెద్దగా దెబ్బతినకపోవడంతో ఇది హత్య లేదా, యాక్సిడెంటా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెంది, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని, ఈ విషయమై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'ఆదిశంకరా'లో వైభవంగా కుంభాభిషేకం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో కుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయాన్ని శ్రీ అయోధ్య రామ మందిరం ట్రస్ట్ శ్రీశ్రీశ్రీ విశ్వ ప్రసన్న తీర్థ స్వామీజీ ప్రారంభించారు. స్వామీజీకి కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య ఘన స్వాగతం పలికారు ఈ పూజా కార్యక్రమంలో ఏవో రామయ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు .

నవోదయం 2.0ను పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నాటు సారా నిర్మూలనకు ప్రత్యేకంగా తీసుకువచ్చిన నవోదయం 2.0ను పక్కాగా అమలుచేసి తిరుపతి, చిత్తూరు జిల్లాలను నాటు సారా రహిత జిల్లాగా తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం తిరుపతిలో తిరుపతి, చిత్తూరు జిల్లాకు సంబంధించిన ఎక్సైజ్ జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలించాలని, ఇందుకోసం కేసులు నమోదు, అవసరమైతే పీడీ యాక్టును అమలు చేసే విధంగా అవగాహన కార్యక్రమాలను, బైండోవర్ కేసులను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసాచారి, బాలకృష్ణన్, ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు శ్రీనివాస్, నాగమల్లేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) JUDICIAL FIRST-CLASS MAGISTRATE PUTTUR

I.A.No.9/2024, O.S.No.150/2015

Between :
T. Krishnaveni ... **Petitioner/Plaintiff.**
And:-
1. T. Manohar, 2. T. Siva Kumar, 3. D. Sujatha 4. Dharani, 5. Sheikh Latheef, 6. Dhrakshayani, 7. D. Venkatesh, 8. K. Teja ... **Respondents/Defendants.**

NOTICE TO RESPONDENTS NO. 1,2,5 & 8

R1: T. Manohar, S/o. late Tenkayala Krishnaiah, Hindu, aged about 48 years,
R2: T. Siva Kumar, S/o. late Tenkayala Krishnaiah, Hindu, aged about 45 years, No. 1 to 2 both are residing at D.No. 3/33, Kapu Street, Puttur Town & Mandal, Chittoor District, Now Tirupathi Dist.,
R5: Sheikh Latheef, S/o. Not Known, Muslim, aged about 63 years, Business, Residing at No. 8-193, Tirupathi Road, Puttur Town & Mandal, Chittoor District, Now Tirupathi Dist.,
R8: K. Teja, W/o. K. Naresh, D/o. D. Venkatesh, Hindu, aged about 27 years, Housewife, Residing at VKR Puram Village & Post, Nagari Mandal, Chittoor District., Now Tirupathi Dist.,

Sir/Madam,

Please take notice that the petitioner filed the above final decree petition against you for partition of petition schedule property. The above said petition is posted to 06-05-2025 for your appearance in the above said petition. If you have got any objections you may appear on 06-05-2025 at 10.30 A.M. either in person or through your conusel and file your objections. In the event of your failure, the matter will be decided exparte. Hearing: 06-05-2025.

MODI SANJEEVI., M.A., L.L.M.,
ADVOCATE, PUTTUR-517583.

యుజిసి ఫెలోషిప్ పునరుద్ధరించాలి



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో యూజీసీ ఫెల్లోషిప్పులను పునరుద్ధరించకుండా నెలరోజుల నుంచి పరిశోధక విద్యార్థులను పరిపాలన భవనం చుట్టూ తిప్పుతున్న అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం స్కాలర్స్, విద్యార్థి సంఘాల నాయకులు ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ ఛాంబర్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో-కన్వీనర్ మాట్లాడుతూ అశోక్ కుమార్ మాట్లాడుతూ పరిపాలన భవనంలోని ఫెల్లోషిప్ సెక్షన్లో ఇంతకు మునుపు ఢిల్లీలో యూజీసీ దగ్గర ట్రైనింగ్ తీస్కొని వచ్చి సమర్థవంతగా యూజీసీ వాళ్ళతో సమన్వయం చేస్తూ ప్రతినెల పీహెచ్డీ విద్యార్థులకు యూజీసీ ఫెల్లోషిప్ వచ్చేలా విధులు నిర్వహిస్తున్న రూపేష్ అనే ఉద్యోగిని ఉన్నత అధికారులు ఎటువంటి కారణం చూపకుండా కామర్స్ కాలేజీకి ట్రాన్ఫర్ చేసి ఆ సీట్లో ఎటువంటి కంప్యూటర్ పరిజ్ఞానంలేని వ్యక్తిని నియమించడంతో రెండు నెలల నుంచి యుజిసి ఫెలోషిప్పులను పునరుద్దరించలేదన్నారు. అందుచే చెక్కెర్ ఐడీలు బ్లాక్ అయి పరిశోధకులకు ఫెలోషిప్పులు నిలిచిపోయాయని వాపోయారు. దీనితో వివిధ అంశాల మీద రీసెర్చ్ చేస్తున్న 76 మంది పరిశోధక విద్యార్థులు ప్రతినెలా మెస్ బిల్లులు చెల్లించలేక, డేటా సేకరణ కోసం ఫీల్డులోకి వెళ్ళడానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, క్రొత్తగా పీహెచ్డీ చేరిన 26 మందికి యూజీసీలో ఫెల్లోషిప్పు నమోదు చెయ్యలేదని తెలిపారు. ఈ సమస్యను గత నెలలో ఇంచార్జ్ వైస్ ఛాన్సర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు దృష్టికి తీసుకువెళ్లిన పరిశోధక విద్యార్థులకు వారు నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తూ, అడ్మినిస్ట్రేషన్తో మీకు సంబంధంలేదని, కొత్తగా వచ్చిన ఉద్యోగికి పని నేర్పించిన తర్వాత మీకు ఫెలోషిప్ల పునరుద్దిస్తామని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో పరిశోధక విద్యార్థులు చేసేదేమిలేక విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నేరుగా వైస్ ఛాన్లర్ చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకూ ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో నేరుగా వైస్ ఛాన్లర్ ఛాంబర్లోకి దూసుకెళ్లి అక్కడ నినాదాలు చేశారు. అనంతరం ఇన్చార్జి ఉపకులపతి అప్పారావు, డెవలప్మెంట్ డీన్ బాలాజీ జోక్యం చేసుకొని ఎనిమిదవ తేదీ లోపు మీ ఫెలోషిప్పులను పునరుద్దించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. కొత్తగా వచ్చిన ఉద్యోగికి ట్రైనింగ్ ఇచ్చేంతవరకు ఇంతకుమునుపే ఉన్న ఉద్యోగి రూపేష్ ని అక్కడ కొనసాగించాలని మళ్లీ ఇటువంటి సమస్య ఎదురు కాకుండా చూడాలని లేనియెడల యూనివర్సిటీ విద్యార్థులుతో కలిసి ఎనిమిదవ తేదీన పరిపాలన భవనాన్ని అష్టదిగ్బంధం చేస్తామని వాళ్ళు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, జిఎన్ఎస్ వ్యవస్థాపకుడు శివ శంకర్ నాయక్, నల్సా వ్యవస్థాపకుడు సుందర్ పరిశోధక విద్యార్థులు శ్రీనివాసులు, సంతోష్, చక్రి, హనీఫ్, నరేష్, శివ, దొరబాబు, శ్రీనివాస్,సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తాం: నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం: తిరుపతి రూరల్ మండలం మహిళలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాక పంచాయతీని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు, మరెన్నో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా మండలంలోని రైతులందరికీ వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఘనంగా మణి రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, శ్రీ బొమ్మ రాజపురం గ్రామానికి చెందిన సర్పంచ్, ప్రముఖ వ్యాపారవేత్త, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.మణి రాజు 68 వ పుట్టినరోజును మహారాష్ట్ర న్యూ ముంబైలో తమ బిఎంఎక్స్ థియేటర్లో సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి : తిరుపతి, రాజీవ్ నగర్ సెక్షన్లో 33/11 కె.వి. వైకుంఠపురం ఫీడర్, 11 కె.వి. అమరావతి ఫిడర్లు మరమ్మతులు, విద్యుత్ లైన్లను తొలగించుటకు ఈ రోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపి.ఎస్పీ.డి.సీయల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ చంద్ర శేఖర్రావ్ శుక్రవారం తెలిపారు.

స్విమ్స్ కాలేజీ అఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలో వర్క్షాప్

ప్రజాశక్తి - తిరుపతి : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలో మైయోఫేషియల్ నొప్పికి ట్రిగ్గర్ పాయింట్ థెరపి అనే అంశంపై గురు, శుక్ర వారాల్లో స్విమ్స్, శ్రీ పద్మావతి ఆడిటోరియంలో వర్క్ షాప్ నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డా.రెహీబ్ పౌండర్, డైరెక్టర్ ఆఫ్ సినర్జీ ఫిజియో కేర్ సెంటర్ చెన్నై, డా. సురేష్ ఫ్రాన్ కిన్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డా. మాధవిలు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పల్లెనిద్రతో ప్రజల్లో మమేకం : ఎస్ఐ స్వప్న

ప్రజాశక్తి - ఓజిలి : పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు ఇస్తోందని ఎస్ఐ స్వప్న తెలిపారు. పల్లెనిద్ర చేస్తూ, గ్రామస్థులతో మమేకమవుతూ వారి సమస్యలను విని, క్షేత్ర స్థాయిలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీలో ఎస్ఐ స్వప్న, టీడీపీ నాయకులతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు, కంకణాల వరప్రసాద్ నాయుడు, పాడి వెంకట సుబ్బయ్య, దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, రఫి, కోటీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెలుగుకార్యాలయంలో గ్రామ సమాఖ్య లీడర్లు, సంఘమిత్రలు, ఐ.సి.ఆర్.పిలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న చాంపియన్ రైతుల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయంపై అన్ని శాఖలతో కలిపి సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి త్రివిక్రమరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాత్లాడుతూ భవిష్యత్ తరాలు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలంటే ప్రతి రైతు ప్రకృతి వవ్యసాయం చేయాలని పిలుపు నిచ్చారు. వ్యసాయ అధికారి భారతి మాట్లాడుతూ పంట కాలానికి సంబందం లేకుండా ప్రతి పంటకు ముందు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగు (నవ ధాన్యాలు) తో విత్తనాలు కలిపి చల్లడం వల్ల భూమిలో సారం పెరుగుతుందని తెలిపారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయం చేసే మహిళలకు కావలసిన పెట్టుబడులు అందించడంలో గ్రామ సమాఖ్యాలలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎపిసిఎన్ఎఫ్ శ్రీకాళహస్తి డివిజన్ మాస్టర్ ట్రైనర్ వెంకటాచలం మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయాన్ని ప్రోత్సహించడానికి, శిక్షణలు ఇవ్వడానికి ప్రతిగ్రామంలో ఐసిఆర్పి సేవలను ఉపయోగించు కోవాలన్నారు. ఐ.సి.డి.యస్.సూపర్వైజర్ యమున మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఏపిఓ మాట్లాడుతూ మహాత్మాగాంధి జాతీయగ్రామీణ ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలుపెంపకం, వరి పొలం గట్లు వెడల్పుకి అర్హతకలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం చాంపియన్ రైతులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు, గ్రామసమాఖ్య లీడర్లు, రైతులు ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది జయలక్ష్మి, ఆశ, రజని, రేవతి పాల్గొన్నారు.

మట్టి వాసనతో ఎదిగి.. న్యాయ మేధావిగా ఒదిగి..



సంచలనాత్మక సవాళ్లతో జాతీయ న్యాయ పరీక్షలో ప్రతిభ చాటిన హరి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : మట్టి వాసనతో ఎదిగిన ఓ యువ కుడు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన AIBE XIX - 2025 న్యాయ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచాడు. భారతదేశంలోని ఏ కోర్టులోనైనా న్యాయవాదిగా వాదనలను వినిపించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించనున్న ఆ యువకుడి స్వస్థలం చిత్తూరు జిల్లా, పాలసముద్రం మండలం, వెంగళరాజకుప్పం. తల్లిదండ్రులు ఎస్తర్, మూర్తి. వ్యవసాయ కూలీ కుమారుడిగా పుట్టిన హరి న్యాయవాదిగా ఎదగడం యువతకు ఆదర్శనీయం.

స్వీయ సమర్థత - చదువులో చతురత.. స్వీయ సమర్థత చదువులో చతురత ఇది న్యాయవాది హరి విజయ రహస్యం. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన హరి బాల్యం నుంచే తన కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చదువుకుంటూనే మరోవైపు విద్యార్థులకు ట్యూషన్ చెబుతూ కొద్దో గొప్పో సంపాదించుకునే డబ్బుతో ఉన్నత విద్యలోకి ప్రవేశించారు. తన విద్యార్జన తన కుటుంబానికి ఏ మాత్రం భారం కాకూడదని భావించిన హరి తన స్వీయ సంపాదనతోనే ఈ స్థాయికి ఎదిగారు. తన స్నేహితులు నవీన్, లక్ష్మిరెడ్డి సహాయం తాను సాధించిన విజయంలో కీలకమని పేర్కొన్నారు. ఆ విధంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంసిఎ, బిఇడి, ఎల్ఎల్బి, ఎంఎ పూర్తి చేశారు.

విద్యార్జనలో ఎనలేని విజయాలు.. హరి తన విద్యా జీవితం, వృత్తి జీవితంలో విశేష ప్రతిభను ప్రదర్శించారు. 7వ తరగతిలో అరుణోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పాలసముద్రంలో టాపర్ గా నిలిచారు. 10వ తరగతి జడ్పీ హైస్కూల్, వెంగళరాజకుప్పంలో టాపర్ గా ప్రతిభ చాటారు. అదేవిధంగా 2010కర్ణాటక బ్యాంకులో ఉద్యోగం, 2011 ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ఉద్యోగం, 2018 ఎపి ఐఐఐటి లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ ప్రొఫెసర్గా ఎంపికయ్యారు. మరోవైపు 2015 తిరుమల తిరుపతి దేవస్థానం సర్వే, విశ్లేషణ కార్యక్రమంలో పాలుపంచుకోవడంతో పాటు రాజకీయ సర్వేలు సైతం నిర్వహించి తనకున్న సామాజిక రాజకీయ విశ్లేషణాత్మక ప్రతిభను కూడా చాటారు. భవిష్యత్తులో న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ నిరుపేద ప్రజలకు న్యాయ సహాయమందేలా జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఆయనకు వివిధ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల ఆచార్యులు, పరిశోధకులు, న్యాయవాదులు హరికి అభినందనలు తెలిపారు.

పాస్టర్ కాటయ్య మృతికి ఎమ్మెల్యే నివాళి



ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణవనం మండలం, పాలమంగళం హరిజన వాడకు చెందిన ఫాస్టర్ కాటయ్య శుక్రవారం మరణించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కాటయ్య స్వగృహానికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపండి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం షణ్ముగం


ప్రజాశక్తి - రామచంద్రపురం: రైతులందరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను సాగు చేయడానికి మక్కువ చూపాలని జిల్లా వ్యవసాయ సాధికార సమితి డిపిఎం షణ్ముగం కోరారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మహిళా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చు అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ వ్యవసాయానికి కషాయాలు ఉపయోగిస్తే మంచిదన్నారు. ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ వ్యవసాయంతో పండించిన కూరగాయలకు డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం గురుమూర్తి, పట్టాభి రెడ్డి, మహిళా రైతులు, వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :



గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గూడూరు, చిల్లకూరు మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ అనుబంధ శాఖలతో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కె.ఏ.పి - 2025 ప్రణాళికపై శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం ఏ.డి.ఏ గోపి నాయాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.డి. ఏ గోపి నాయక్, ఏ.వోలు, రమేష్, చెంచు రెడ్డి, భవాని , ఏ.సి.మురళి, గూడూరు ఏ.పి.ఎం బుజ్జమ్మ, రత్నయ్య సీసీలు తిరుమల, పెంచలయ్య యూనిట్ ఇంచార్జి మనోహర్ రెడ్డి, పూర్ణిమ, ప్రమీల నారాయణమ్మ, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ సంప్రోక్షణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ద్వజస్థంభ సంప్రోక్షణ శుక్రవారం పూర్ణాహుతితో ముగిసింది. శుక్రవారం సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ సేవల అనంతరం ఆలయ ఆవరణలో కుంభ ప్రదక్షణ చేస్తూ ద్వజస్థంభానికి నివేదన సమర్పణ గావించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.